# ఒక తల్లి కథ

"పరీక్షలయిపోయినాయ్, పరీక్షలయిపోయినాయ్" అని కేకేసుకుంటూ, అట్టగాల్లోకి విసిరేసి పట్టుకుంటూ వచ్చినాడు సుగుణమ్మ చిన్న కొడుకు. వాకిలి దాటి ఇంట్లో కొస్తూనే, చేతిలో అట్టా జేబులో పెన్నూ విసిరి కొట్టినాడు గూట్లోకి. "పెన్నుపాడవుతుంది" అని కేకేసింది, పిల్లల బట్టలకు చిరుగులు కుట్టుకుంటున్న సుగుణమ్మ. అమ్మ మాటను వినిపించు కోకుండానే వచ్చి "ఇంకరెన్నెళ్ళు మాకు సెలవులు" అన్నాడు సంతోషంగా. ఆమె యేమీ మాట్లాడలేదు. ఆ సంతోషంలోనే చెప్పుకుని పోతున్నాడు. "అమ్మా! ఈరోజు అమ్మమీద వ్యాసం బలే రాసినాలే" ఎదురుగా కూర్చొని ఆమె ముఖంలోకి చూస్తూ అన్నాడు. "ఏమనిరాసినావు?" అనడిగింది చిరునవ్వుతో ఆమె. హుషారొచ్చింది వాడికి."అమ్మ ప్రేమ అనే అమృతమిచ్చి తన బిడ్డలను పెంచును....." అని పాఠం చదివినట్టు అనే సరికి ఆమె పెద్దగా నవ్వింది. వాడుసిగ్గుపడి ఆపేసినాడు. కొడుకుముఖం చూసి, ఆమె తన నవ్వు ముఖాన్ని మార్చుకుని, "నీ కెట్లా తెలుసు?" అనడిగింది. "ఇంతకు ముందున్న మేరీ టీచర్ చెప్పింది. అమ్మ మీద పాట కూడా ఎంత బాగా పాడేదని!"

సుగణమ్మ పంటికొసతో దారం తెంపుతూ కొడుకుమాటలు వింటోంది. "అమ్మా, మేరీ టీచర్‌ని మాస్కూలు నుంచీ మార్చింది ఎందుకనో!" టీచర్లని బదిలీ చేయడానికి ఎటువంటి కారణాలుంటాయో సుగుణమ్మకు తెలుసుకానీ, ఆకారణాలను తన కొడుకు ప్రేమిస్తున్న మేరీ టీచర్ విషయం లో చెప్పాలనిపించలేదు. "అమ్మ మీదపాట అందరికీ చెప్పాలకదా........ లేకపోతే అమ్మను గురించి పిల్లల కెట్లా తెలుస్తుంది ? అందుకని మార్చేసి వుంటారులే" ఒక్కక్షణం ఆలోచించి, అమ్మమాటను ఒప్పేసుకున్నట్టు ఇంకాదగ్గరకు జరిగి ఆమె మీద చెయ్యేసినాడు. "సూదితగులుతుంది జాగ్రత్త" అంది సుగుణమ్మ. "అమ్మా ఆకలేస్తూంది అన్నం కాలేదా" కడుపులోని ఆకలిని ముఖంలోకి కూడా తెప్పిస్తూ అడిగాడు. "పదైనా కాలేదు అప్పుడే అన్నమా?" "ఆకలేస్తూంది" కడుపురుద్దుకుంటూ కళ్ళల్లో నీళ్ళు మెదులుతుండగా అన్నాడు. "ఆడుకుంటూండు అవుతూనే పిలుస్తాను"

బట్టలు మడతపెట్టుకుని లేచిందామె" "ఆకలేస్తాంది........" మళ్ళీ అదేమాట ఇంకొంచెం గట్టిగా, కొంచెం తిరుగుబాటు ధోరణితో. 'ఇప్పుడు అన్నం తినకపోతే ఆడుకోలేను. అసలు కదల్లేను' అన్నట్టు నేలమీదనే పడుకున్నాడు. "ఛీ! ఛీ! బట్టలు మాస్తాయి. లే! దరిద్రపు వెధవా!" అని కసిరింది. అంతకోపం తెచ్చుకుని, ఆమాట అనాలనుకోలేదు ఆమె. అదే వచ్చేసింది! అందుకే ఇంకా చిరాకు కలిగింది. "తెల్లారింది మొదలు ఆకలి...... ఆకలి. ఇదేంజబ్బో"

"ఆకలెయ్యడం జబ్బా? వెయ్యకపోవడమే జబ్బు" అన్నాడు పెద్దవాడు, నెమ్మదిగా కచ్చితంగా. ఎప్పుడొచ్చినాడో వాడువసారాలో మంచంలో పడుకునున్నాడు.

"నీకూ అప్పుడే ఆకలేస్తోందా?" వాడుపలకలేదు.

"అందుకే నన్నమాట అక్కడే పడిపోయింది! వీడింట్లో నుండి బయటికి పోలేకపడిపోతే, నువ్వింట్లోకి రాలేక బయటే పడిపోయినావు! ఏర పిల్లర్రా నాయినా, ఇంతాకలి ఎక్కడా చూల్లేదు! కాఫీలు తాగి గంటకాలేదు అప్పుడే ఆకలో......... ఆకలో!"

"ఒట్టి కాఫీ గదా" అన్నాడు చిన్నవాడు లేచి కూర్చుని. "అదీ బెల్లంది" అన్నాడు పెద్దవాడవతలినుంచీ.

"ఏదైతేనేం? బెల్లంకాఫీ తాగేది మనమే కాదు"

"ఆకలేసేదీ మాకేకాదు" మళ్ళీ పెద్దవాడు, కొంచెం చిన్నగా.

"అయినా, ఎవరూ మీ అంతగా గొడవ చెయ్యడం లేదు.

"టిఫిన్లు తింటే ఎందుకు చేస్తారు?"

సుగుణమ్మ ఇక మాట్లాడలేదు. టిఫిన్లు చెయ్యడం సాధ్యం కాదని వివరించి చెప్పినా లాభం లేదు. ఎందుకంటే, వాళ్ళకిప్పుడు వేస్తోందంటున్న ఆకలికి అది పరిష్కారం కాదు. ఏవస్తువునూ కొని 'టిఫిన్' గా చెయ్యడం సాధ్యం కానట్టు వున్న ధరలనుగురించి తాను చెప్పవచ్చు. ఈ ధరల్లో కూడా 'టిఫిన్లు' తింటున్నవాళ్ళని చూస్తూనే వుంటారు. అటువంటి వాళ్ళను గురించే ఇప్పుడు పెద్దవాడు చెబుతున్నది. సుగుణమ్మ ఆలోచిస్తూనే, వడలిపోయిననాలుగైదు వంకాయలను తరిగి, నీళ్ళలో వేస్తూ కూచుంది.

"కొబ్బరన్నా వుంటే ఇవ్వవూ?" అన్నాడు చిన్నవాడు. ప్రస్తుతానికి దాన్తో

సరిపెట్టుకుంటానన్న రాజీధోరణితో.

"లేదు" అంది సుగుణమ్మ. కొబ్బరిధరెంతో జ్ఞాపకం చేసుకుంది.

"పప్పులో.........."

"అవీ లేవు" పప్పుల ధరకూడా తప్పని సరిగా.

"బెల్లమన్నా........"

ఆమె పలకలేదు. వాడు ఏడుపుసాగించినాడు. ఏడుస్తూనే లేచి వెళ్ళి వసారాలో వున్న పెద్దవాడి పక్కన పడుకున్నాడు. "ఆకలిబాధితులిద్దరూ ఏకమయ్యారు" అనుకుంటూంటే ఆమెకు నవ్వొచ్చింది. ఆనవ్వుకు తనకు తెలీకుండానే కన్నీటి తడీతాకింది. ఆ అనుభవం నుంచీ ఆమె బయటపడిచూసే సరికి అన్నదమ్ములిద్దరూ ఆసక్తిగా ఏదో మాట్లాడుకుంటున్నట్లు గమనించింది. వసారాలోకి వున్న కిటికీ ద్వారా ఇద్దరూ కనిపిస్తున్నారు. ఏదో ఉద్వేగం పడుకో నివ్వకుండా వాళ్ళని కూచో బెట్టినట్టుంది.

"ప్రభాకర్ వాళ్లింట్లో ప్రతిరోజూ టిఫిన్ చేసుకుంటారు. ఒక్కో రోజు సాయంత్రం కూడా చేసుకుంటారు!"

"సాయంత్రం కూడానా?" ఆశ్చర్యంగా అడుగుతున్నాడు చిన్నవాడు.

"ఆ......... సాయంత్రం కూడా..........."

"అబ్బ.......... ! రోజూ రెండు సార్లు టిఫిన్లు! "

"అయితే, ప్రభాకర్ వాళ్ళింట్లో తిననేతినడు"

"తినడూ? ఏం?" ఇంకా ఆశ్చర్యంగా అడిగినాడు. ఎందుకో కిటికీ గుండా అమ్మకేసి చూసినాడు. అంతవరకూ వాడికేసి చూస్తున్నదల్లా, చూపు మార్చుకుంది సుగుణమ్మ. "ఎందుకు తినడూ?" అని మళ్లీ అడిగినాడు చిన్నగా.

"హోటల్లో తింటాడు, ఇంట్లో బావుండదంట. తనతో వున్న వాళ్ళక్కూడా వాడేడబ్బులిస్తాడు. ఒక రోజునేనూ స్పెషల్ దోసెతిన్నాను"

"స్పెషల్ దోసె.......... ఎట్టుంది?"

"బాగుంటుంది"

"బాగా సరే....... ఎట్టుంటుందని!" ఏమని అడగాలో తెలీలేదో, 'బాగుంటుంది', అన్నఒక్క ముక్క సంతృప్తినివ్వలేదో మరి.

"నీ మొహం........" చెప్పలేక కసురుకున్నాడు పెద్దవాడు. వాడదేం లెక్క పెట్టలేదు. "స్పెషల్ దోసె నేనెప్పుడూ చూల్లేదు" అంటున్నాడు. వినలేక లేచింది సుగుణమ్మ. ఆ ప్రభాకర్‌తో వెళ్ళి హోటల్లో స్పెషల్ దోశ తిన్నందుకు పెద్దవాడిని మందలించాలా? 'అమ్మ పెట్టదూ, అడుక్కుతిననివ్వదూ' అని వాళ్ళనక పోవచ్చుకానీ, అటువంటి సామెతవున్నట్టు తనకు తెలుసు. కాదు, కాదు, అట్లా ఆలోచించకూడదు. 'అమ్మ పెట్టదు' కాదు, పెట్టలేకపోతూంది. పెట్టలేకపోయినా సరే, 'అడుక్కుతిన' నివ్వకూడదు. తన పిల్లలకంటే ఎంతో హీనంగా వీధుల్లో కుక్కల మాదిరి బతుకుతున్న పిల్లలెందరో వున్నారు దేశంలో. తనపిల్లలేదో తింటున్నారువేళకు.

సుగుణమ్మ వంట చేస్తూనే ఆలోచిస్తోంది. బియ్యం డబ్బాలో నుంచీ అందుకుంటున్నప్పుడు అదిరిపడింది. పూర్తిగా మూతతీసి, కిటికీ, రెక్కతెరచి, బియ్యంలో చేయిముంచి చూసి.......... నెమ్మదిగా, గుండె ఆగిపోకుండానన్నట్టు ఊపిరిపీల్చుకుంది. తన భయం వల్ల బియ్యం అడుక్కుపోయినట్టు అనిపిస్తూందేమోని మళ్ళీ చూసింది. దిగులుగా భయంగా కూచుంది.

"ఇంకా కాలేదా అన్నం?" అని కేకేశాడు చిన్నవాడు.

"కడుపులో బాధగావుంది" అన్నాడు పెద్దవాడు.

"బాధగావుంటే ఆ ప్రభాకర్ దగ్గరికెళ్ళు, వీన్ని కూడా తీసుకపో. వాళ్ళింట్లో కుక్కలకు పడేసినట్టు తిండిపెట్టిస్తాడు. తినొచ్చి ఎంతబాగావుండిందీ, అటువంటి తిండి మీ అమ్మ పెట్టలేక పోయిందీ చెప్పుకుందురు" వాళ్ళిద్దరూ చెప్పుకున్న మాటల్ని అమ్మవిందని తెలిసిపోవడం వల్లనో, అమ్మ బాగా కోపంగా వుందనో నిశ్శబ్దంగా వుండిపోయారు.

★ ★ ★

సుగుణమ్మకి నిద్రరావడం లేదు. డబ్బాలో బియ్యం అడుగునతాకినప్పటి స్పర్శ ఇంకా ఉలికి పాటు కలిగిస్తూంది. పిల్లలకు సెలవులొచ్చినాయి. బియ్యం త్వరగా అయిపోయినాయి. పిల్లల సెలవులకూ, బియ్యం త్వరగా అయిపోవడానికీ సంబంధం

యేమిటో తనవంటి అమ్మకే తెలుసు. స్కూలుంటే రోజుకు రెండు సార్లు మాత్రమే అన్నం తింటారు. సెలవులు కనుక, పిల్లలకేంతోచక ధ్యాస తిండిమీదికి మళ్లుతుంది. లేదా ఆటల వల్ల నైనా బాగా ఆక లేస్తుంది. టిఫిన్లేం చేయగలదు తను? అందువల్ల ఆకలేసినా, ఆకలేస్తోన్నట్టు అనిపించినా అన్నం తినవలసిందే. బియ్యం త్వరగా అయి పోకుండా ఎట్లాగుంటాయి?

అటువైపు మంచంలో పెద్దవాడూ, తనపక్కనే వున్న మంచంలో చిన్నవాడూ నిద్రబోతున్నారు. పగలు వాళ్ళు మాట్లాడుకున్న మాటలు జ్ఞాపకం వస్తోన్నాయి. "రోజూ టిఫిన్ చేసుకుంటారూ!" "స్పెషల్ దోశ ఎట్టుంది?" అని ఆశ్చర్యంగా అడుగుతున్న చిన్నవాడు కనిపిస్తున్నాడు. సుగుణమ్మ వాడి పక్కన కూర్చుని, పొడుగు కొలుస్తున్నట్టుగా తలనుంచీ పాదం దాకా నిమిరింది. అమ్మ మీద వ్యాసం రాసిన కొడుకు. "అమ్మ ప్రేమ అనే అమృత మిచ్చి బిడ్డలను పెంచును" -నిజంగా నువ్వు నీవ్యాసంలో చెప్పినంత సులభంగా అమ్మ బిడ్డల్ని పెంచగలిగితే ఎంత బావుంటుంది! అమ్మ ప్రేమ అనే అమృతమిస్తుంది కానీ, దాన్తో బిడ్డల్ని పెంచలేదే? అమ్మయినాసరే, బిడ్డల్ని, పెంచడానికి బియ్యమూ, పప్పులూ వంటివస్తువులమీద ఆధారపడవలసిందేనే! అమ్మను గురించి అంత గొప్పగా వ్యాసం రాసి ఇంటికొస్తే ఏమయింది? 'అడుక్కు తినండి' అని తిట్టింది. అమ్మ నిస్సహాయత అది. అందుకు అమ్మను క్షమించండి, కానీ అమ్మ ప్రేమనింతగా అవమానిస్తున్న, ఇంతగా సంకుచితం చేస్తున్నవాళ్ళని క్షమించకండి. అమ్మ తన బిడ్డల్ని ప్రేమించడమనేది అమెవల్లనే సాధ్యమయ్యేది కాదనీ, ప్రభుత్వాలూ, మిగతా ప్రపంచమంతా సహకరిస్తేనే సాధ్యపడుతుందనీ గ్రహించండి. -తన భావాల్ని వాడి లోపలికి చేరుస్తున్నట్టుగా కొడుకును అనుకుని పడుకుంది సుగుణమ్మ.

*(6-8-'75 'ఆంధ్రప్రభ' వారపత్రికలో ప్రచురితం)*

## -- కథ గురించి. . .

'కన్నతల్లి' అన్న పేరుతో ఈ కథ అప్పుడు అచ్చయింది. ఇందులో పిల్లలు మాట్లాడుకోవడం దయనీయంగా వున్నప్పటికీ, అందువల్లనే యీ కథ పునర్ముద్రణకు అర్హమనుకోలేదు. తల్లీ పిల్లల మధ్య సంబంధాన్ని 'సెంటిమెంటల్' గా కాకుండా (సందర్భం వస్తే చూపించరాదని కాదు) , సమాజవ్యాప్తమైన బృహద్రూపంగా గుర్తించడమూ, దాన్ని తల్లి చైతన్యానికి మించిన ధోరణిలో చెప్పకపోవడమూ ఇందుకు కారణాలు.